క్లుప్తంగా

8 గంటల పని విధానం అమలు చేయాలి



పెనమలూరు: కార్మికులకు 8 గంటల పని విధానం అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి డిమాండ్ చేశారు. పోరంకిలో శనివారం పోరంకి మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి మాట్లాడుతూ కార్మికులకు అమలు జరుగుతున్న 8 గంటల పని విధానాన్ని కూటమి ప్రభుత్వం మార్పు చేసి 10 గంటలు చేసిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు కార్మికులకు అనేక హామీలు ఇచ్చి నేడు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 10 గంటల పని విధానం నిలిపి వేయాలని, కార్మికుల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయని పక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్మిక సంఘ నేతలు వై.సరళ, జ్యోతిమేరి, విష్ణు, దుర్గారావు, లక్ష్మికుమారి, కార్మికులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకోదండరామస్వామివారి దేవస్థానంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం 150 మంది మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. మూల మంత్రహోమం, స్వామివారికి పుష్పాలు సమర్పించారు. నూతన విగ్రహాలకు క్షీరాధివాసం చేశారు. ఆదివారం ఆలయంలో ఉదయం 7.45 గంటలకు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం ఘనంగా చేయనున్నారు. శ్రీసీతారామచంద్రస్వామి, దాసాంజనేయ సిద్ధి గణపతి సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట చేస్తారు. శిఖర ప్రతిష్ట చేసి శాంతికల్యాణం చేస్తారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి తెలిపారు.

ఆవు, దూడ అదృశ్యం

నున్న(విజయవాడరూరల్): ఆవు, గిత్త దూడను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయిన సంఘటన నున్న గ్రామంలో శనివారం జరిగింది. వీరారెడ్డి అనే రైతు గ్రామంలో జరిగే నూతన గృహప్రవేశాల పూజా కార్యక్రమాలకు ఆవుని, గిత్త దూడను తీసుకెళుతుంటాడు. ఈ నెల 5వ తేదీన శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి జరిగిన కార్యక్రమంలో ఆవు, గిత్త దూడలకు పూజలు చేయించి ఆ రాత్రి, మరుసటి రోజు మందిరం సమీపంలో వీరారెడ్డి వాటిని కట్టేసి ఉంచాడు. శనివారం తెల్లవారు జామున వాటికి నీళ్ల పెట్టి, మేత వేసేందుకు వెళ్లి చూడగా కనిపించలేదు. ఆవు, గిత్త దూడకోసం చుట్టుపక్కల గాలించినా ఎక్కడా వాటి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సుమారు రూ.60 వేలు విలువ ఉంటాయని వీరారెడ్డి తెలిపాడు.

నేల పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలి

రామవరప్పాడు: రైతులు నేల పరీక్ష ఆధారిత ఎరువులు వినియోగం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పీఎస్ శివప్రసాద్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్-2025 ప్రీ ఖరీఫ్ కార్యాచరణలో భాగంగా ఎనికేపాడులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గూడవల్లిలో శాస్త్రవేత్త కిషోర్ వర్మ, నిడమానూరులో డీఏవో విజయకుమారి, ఏడీఏ వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్త రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో డాక్టర్ మహేష్, కేవీ చౌదరి, కేవీకే శాస్త్రవేత్త లక్ష్మి కళ, రాజప్ప, వ్యవసాయ శాఖ అధికారి రంగనాథ్ బాబు, పశుసంవర్థక శాఖ అధికారి లక్ష్మి ప్రసన్న, టి.జశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయ కూచిపూడి నృత్య కళలను కాపాడుకోవాలి



గన్నవరం: కూచిపూడి వంటి సంప్రదాయ నృత్య కళలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. నటరాజ్ డాన్స్ అండ్ మ్యూజిక్ ట్రస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలను శనివారం స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పాశ్చాత్య పోకడలతో సంప్రదాయ నృత్యాలకు ఆదరణ కొల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. సంప్రదాయ నృత్యాల్లో పిల్లలకు ప్రోత్సాహాన్నిస్తున్న నాటరాజ్ డ్యాన్స్ అకాడమీని ఆయన అభినందించారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ఉందని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేఎస్.జగదీశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అకాడమీ చైర్మన్ ప్రసాద్, డాక్టర్ సురేష్, కొల్లూరి దివ్య, డాక్టర్ నిరంజన్, కే విజయబాబు పాల్గొన్నారు.

పేదల ఇళ్లపై కూటమి కన్ను

- కానూరు మురుగుకాలువ కట్టపై 40 ఏళ్లుగా పేదల నివాసం
- 11వ తేదీ నాటికి ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని నోటీసులు
- కానూరులో ఇళ్ల తొలగింపునకు నోటీసులు జారీ
- లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్న తహసీల్దార్
- ప్రత్యామ్నాయం చూపకపోతే ఎక్కడికి వెళ్లాలంటూ పేదల ఆందోళన



కానూరులో తొలగించనున్న పేదల ఇళ్లు

పెనమలూరు: కానూరులో పేదల ఇళ్లపై కూటమి ప్రభుత్వం కన్నేసింది. గ్రామంలో మురుగు కాలువ కట్టపై గత 40 సంవత్సరాలుగా నివశిస్తున్న పేదల ఇళ్లు ఖాళీ చేయాలని తహసీల్దార్ నోటీసులు ఇచ్చారు. స్వచ్ఛందంగా ఇళ్లు తొలగించని పక్షంలో ఈ నెల 11న తగిన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో బాధిత కుటుంబాలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

వివరాలు ఇవీ..

కానూరులో ప్రధాన రహదారి నుంచి ఉన్న మురుగు కాలువ కట్టపై గత 40 సంవత్సరాల క్రితం దాదాపు 50 నిరుపేద కుటుంబాలు చిన్న చిన్న ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్నారు. విద్యుత్ బిల్లులు, మున్సిపాలిటీ ఇతర పన్నులు కూడా చెల్లిస్తున్నారు. ఈ ప్రాంతంలో నివశించేవారంతా రెక్కాడితే కాని డొక్కాడని వారే.

నోటీసులు జారీ

మురుగు కాలువ కట్టపై నివశిస్తున్నవారికి రెవెన్యూ అధికారులు హఠాత్తుగా నోటీసులు ఇచ్చారు. నోటీసుల్లో పలు సర్వే నంబర్లు పేర్కొంటూ అందులో ఉన్న భూమిలో కొంత రోడ్డుగా, మిగితాది డ్రెయినేజీగా ఉందని పేర్కొన్నారు. నోటీసు అందిన ఆక్రమదారుడు 11వ తేదీ నాటికి ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని లేని పక్షంలో తాము చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నోటీసులు చూసిన పేదలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు ఖాళీ చేయమనటం కూటమి ప్రభుత్వానికి తగదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

40 సంవత్సరాలుగా నివాసం

కానూరులో మురుగు కాలువ కట్టపై నిరుపేద కుటుంబాలు గత 40 సంవత్సరాలుగా ఉంటున్నారు. ఇక్కడ ఉండేవారందరూ నిరుపేదలే. అధికారులు వచ్చి నోటీసులు ఇస్తే తమకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని భావించామని, తీరా ఉన్న ఇంటినే తొలగించాలని నోటీసులలో ఉండటంతో ఏం చేయాలో పాలుపోవటం లేదని బాధితులు తెలిపారు. పేదలపై కూటమి ప్రభుత్వం కత్తికట్టడం న్యాయం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా చేస్తే స్వచ్ఛందంగా పోతాం..

న్యాయం చేయని పక్షంలో ఆందోళన చేస్తామని బాధితులు తెలుపుతున్నారు. తమకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే తాము స్వచ్ఛందంగా తరలిపోతామని తెలుపుతున్నారు. తమకు న్యాయం చేయక పోతే మరణమే శరణ్యమని తెలుపుతున్నారు.

ఎక్కడికి పోవాలి ?



ఎన్నో ఏళ్లుగా ఉంటున్న తమ ఇళ్లు కూల్చి వేస్తే తాము ఎక్కడికి పోవాలి. ప్రభుత్వం తమకు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలి. పేదల పట్ల కక్ష చూపటం ప్రభుత్వానికి తగదు. మా బాధ అర్థం చేసుకోవాలి.

– విజయలక్ష్మి, బాధితురాలు

ప్రత్యామ్నాయం చూపేవరకు ఇక్కడే



తమ ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వటం తగదు. చాలా సంవత్సరాలుగా పేదలమైన మేమంతా ఇక్కడే జీవిస్తున్నాం. తమకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపే వరకు ఇక్కడే ఉంటాం. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలి.

– ఆకుల వెంకటేష్, బాధితుడు, ఆటో డ్రైవర్

ఎన్‌హెచ్ డ్రెయిన్లలో ముమ్మరంగా పూడికతీత



డ్రెయిన్లలో పూడికలు తొలగిస్తున్న సిబ్బంది

గన్నవరం: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారికి ఇరువైపులా డ్రెయిన్లలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) పరిధిలోని ఈ డ్రెయిన్లలో కొన్నేళ్లుగా పూడికలు తొలగించడం లేదు. దీంతో డ్రెయిన్లు పూర్తిగా చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఫలితంగా మురుగునీటి ప్రవాహం ఎక్కడికక్కడ నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వర్షకాలంలో నీరు జాతీయ రహదారిపైకి చెరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎన్‌హెచ్ డ్రెయిన్లలో పూడికలు తొలగించేందుకు గ్రామ పంచాయతీ ముందుకువచ్చింది. గ్రామ పంచాయతీ నిధులతో స్థానిక కొత్తపేట నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎన్‌హెచ్ డ్రెయిన్లలో సిల్ట్ తొలగిస్తున్నారు. ప్రత్యేక సిబ్బందితో డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తాచెదరం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నారు. మరికొన్ని చోట్ల జేసీబీ మిషన్లలో పూడికలు తీస్తున్నారు. తొలగించిన సిల్ట్‌ను ట్రాక్టర్ల ద్వారా గ్రామం వెలుపలికి తరలిస్తున్నారు. వారం రోజులుగా డ్రెయిన్లలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు తెలిపారు. పూర్తిస్థాయిలో పూడిక తొలగించి మురుగునీటిని క్రమబద్దీకరించనున్నట్లు చెప్పారు.

చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు



వేలేరులోని చిన్న మల్లమ్మ కుంట చెరువులో యథేచ్ఛగా సాగుతున్న మట్టి తవ్వకాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులో అక్రమ మట్టి తవ్వకాలకు తెగబడ్డారు. అధికార టీడీపీ అండదండలతో గ్రామంలోని చిన్న మల్లమ్మ కుంట చెరువులో శనివారం పొక్లెయిన్ల సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టి యథేచ్ఛగా ట్రాక్టర్లతో తరలించారు. రీ సర్వే నంబర్ 297లో సుమారు 19 ఎకరాల్లో విస్తరించిన చిన్న మల్లమ్మ కుంట చెరువు ఆక్రమణలపై ఇప్పటి హైకోర్టు, లోకాయుక్తాలో కేసులు పెండింగ్‌లో ఉండగా అక్రమార్కులు బేకాతఖరు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా మట్టి తవ్వుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులు మొద్దునిద్ర నటించటంతో అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఈ వ్యవహారంపై కొందరు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానే. సామాజిక మాధ్యమాల్లోనూ పోస్ట్ చేశారు. దీంతో ఎట్టకేలకు రెవెన్యూ యంత్రాంగం కదిలివచ్చింది. క్షేత్రస్థాయిలో వీఆర్వోతో పాటుగా ఇతర అధికారులు చేరుకుని చిన్న మల్లమ్మ కుంట చెరువులో మట్టి తవ్వకాలను తాత్కలికంగా నిలిపారు.

త్యాగం, ఐక్యతకు ప్రతీక బక్రీద్



ముస్తాబాద బక్రీద్ ప్రార్థనలో భక్తులు



ముస్తాబాదలో సందేశమిస్తున్న ఇమాం హసీన్ ఇక్బాల్



ఉయ్యూరు ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కానూరులో బక్రీద్ పండుగ సందర్భంగా నమాజ్ చేస్తున్న ముస్లింలు



పి.నైనవరం బక్రీద్ వేడుకల్లో మత గురువు జావేద్, ముస్లింలు



కుందేరులో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

గన్నవరం రూరల్: త్యాగానికి, ఐక్యతకు ప్రతీక బక్రీద్ అని ముస్తాబాద జామియా మసీద్ ఇమాం హసీన్ ఇక్బాల్ భక్తులకు సందేశమిచ్చారు. శనివారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఈద్గా మైదానంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన మాట్లాడుతూ ముస్లింలు జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్ అన్నారు. మనిషి దైవానికి దగ్గర కావాలన్నా, సాటి మానవుల హృదయాల్లో చోటు సంపాదించాలన్నా త్యాగమే ఉత్తమ మార్గమని ప్రవక్త ఇబ్రహీం జీవితం చెప్పిందన్నారు. మనకున్న దాంట్లో ఇతరులకు దానం చేయటం బక్రీద్ సందేశమన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో నడవాలన్నారు. ఈద్గా వద్ద భక్తుల ఏర్పాట్లను మసీద్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. తెంపల్లి, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, చిక్కవరం, గొల్లనపల్లి, కొండపావులూరు, సూరంపల్లి తదితర గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని భక్తులు జరుపుకున్నారు.

ఉయ్యూరు ఈద్గా మైదానంలో

ఉయ్యూరు: బక్రీద్ పర్వదినాన్ని ఉయ్యూరులో శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రార్థనలు చేసి ఈద్గా మైదానంలో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్షతున్నీసాబేగం, కౌన్సిలరు ఎండీ బేగ్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి మైనార్టీ నాయకులకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

కంకిపాడులో ప్రత్యేక ప్రార్థనలు

కంకిపాడు: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. శనివారం బక్రీద్ పర్వదినం సందర్భంగా ఉదయం కంకిపాడు, ఈడుపుగల్లు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కంకిపాడు బైపాస్‌సమీపంలోని ఖాళీ స్థలంలోనూ, గోసాల సెంటరులోని ఎస్‌జీఎస్ కల్యాణ మండపంలో ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు, మసీదు మౌజన్‌లు ప్రార్థనలు చేయించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కుందేరులో ప్రత్యేక ప్రార్థనలు

అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం జమాత్ ఆధ్వర్యంలో మండలంలోని కుందేరు గ్రామంలో బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లిం జమాత్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ముహమ్మద్ యాకుబ్ పాషా మాట్లాడుతూ బక్రీద్ పండుగ విశిష్టతను తెలియజేశారు. దాన ధర్మాలు చేయాలని ఇస్లాం బోధిస్తుందని, దాన గుణంతో ముడిపడి ఉన్నదే మానవ ధర్మం అని వివరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా బక్రీద్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిడమానూరులోని మినార్ మసీద్‌లో మౌలానా అబ్దుల్ జావీద్ ఆధ్వర్యంలో నమాజును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జావీద్ మాట్లాడుతూ దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటారన్నారు. హిందువులు, ముస్లింలు ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఇస్మాయిల్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పెనమలూరులో

పెనమలూరు: మండల పరిధిలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేశారు. ముస్లింలు ఉదయాన్నే మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకొని నమాజ్ చేశారు. బక్రీద్ పండుగ అంటే త్యాగం, భక్తి, విశ్వాసానికి ప్రతీక అని మహ్మద్‌ప్రవక్త బోధించారని మత పెద్దలు తెలిపారు. కానూరు సనత్‌నగర్‌లో మస్జిద్ ఏ మేబారక్ అహలెహదీస్ ఆధ్వర్యంలో ఈదుల్ అజహ నమాజ్ పిన్నమనేని టీచర్స్ కాలనీ గ్రౌండ్‌లో నిర్వహించారు. యనమల కుదురు ఈద్గాలో బక్రీద్ పండుగ ఘనంగా చేశారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరితికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. గంగూరు, తాడిగడప, పోరంకి, గోసాల, పెదపులిపాక, వణుకూరు గ్రామాలలో బక్రీద్ పండుగ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

గన్నవరం: బక్రీద్ పండుగను గన్నవరం ప్రాంతంలో శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురం ఈద్గా వద్ద గన్నవరం జమామసీదు కమిటీ ఆధ్వర్యంలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మత గురువులు బక్రీద్ సందేశం ఇచ్చారు. అంజుమన్ కమిటీ సభ్యులు, గన్నవరం, కేసరపల్లి, దుర్గాపురం పరిధిలోని ముస్లింలు హాజరయ్యారు. దావాజిగూడెంలోని పామర్తినగర్‌లో ఉన్న ఈద్గా వద్ద బక్రీద్ ప్రార్థనలు జరిపారు. దావాజిగూడెం, అల్లాపురం గ్రామాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో బక్రీద్

విజయవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని ముస్లింలు నైనవరం గ్రామంలోని మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. మత గురువు ఎండీ జావేద్ మాట్లాడుతూ దైవానికి ప్రీతిపాత్రులుగా ఉండాలంటే త్యాగనిరతి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ పెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నున్న గ్రామంలోని చెరువు సెంటర్లో మసీదులో ముస్లిం మహిళలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాలో జరిగిన బక్రీద్ ప్రార్థనలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మత గురువు అక్బర్ రెహ్మాన్ ప్రసంగించారు. ఇమామ్ షాదీద్, కమిటీ పెద్దలు షేక్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు. నున్న టీచర్స్ కాలనీ మక్కా మసీదులో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగుల్ మీరా ఆధ్వర్యంలో నమాజ్ కార్యక్రమం నిర్వహించారు. ఇమామ్ మహ్మద్ గౌస్ బక్రీద్ పండుగ విశిష్టతను తెలిపారు.

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బాపులపాడు మండలంలోని పలు మసీదుల్లో శనివారం ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డు, నెహ్రూ నగర్, మహాత్మగాంధీ నగర్, కొత్తపల్లి,కొత్త మల్లవల్లి, వేలేరు, శోభనాద్రిపురం గ్రామాల్లోని మసీదుల్లో అధిక సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు. త్యాగనిరతికి బక్రీద్ పండుగ చిహ్నమని ముస్లిం మత గురువులు బోధించారు. ప్రతి మానవుడు పొరుగువారికి చేతనైనా సాయం అందించాలని చెప్పారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



పోరంకిలో శ్రీవారి కల్యాణం

పెనమలూరు: పోరంకి గ్రామం లక్ష్మీపురం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామివారి తిరుకల్యాణమహోత్సవం ఘనంగా చేశారు. ఆలయంలో ఉదయం సువర్ణ పుష్పార్చన, తిరుప్పావడ సేవ, సామూహిక విష్ణు సహస్రనామపారాయణ పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో రాత్రి త్రిదిండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీవారి తిరుకల్యాణం అత్యంత వైభవంగా చేశారు. కాగా ఆదివారం ఆలయంలో భక్తులకు అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.


అలరించిన ఆపాత మధురాలు



గాయకులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: గంగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నెల వారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ఆపాత మధురాల సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. గాయనీ గాయకులు సింధూ, రజని, మల్లీశ్వరి, కృష్ణకుమారి, వేణుగోవింద్ తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. గంగా ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకుడు గంగాధర్ మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు పేద కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమ కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, ఆదిరాల జయప్రభు పాల్గొన్నారు. గాయనీ గాయకులను, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.


ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



కండ్రికలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ

పాయకాపురం(విజయవాడరూరల్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం విలేజి కండ్రిక రోడ్డులో 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్లో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 35 వేప మొక్కలు, 35 గానుగ మొక్కలు, 30 పొగడ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు యరగొర్ల శ్రీరాములు, శానిటరీ ఇన్స్పెక్టర్ గోపిరాజు, డ్వాక్రా సంఘాల సీవో కిషోర్, యూసీడీ జగదీశ్వరీ, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, పార్క్ సెక్షన్ సూపర్‌వైజర్ విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయిలో యోగాంధ్ర పోటీలు



పటమట(విజయవాడతూర్పు):నగర పాలక సంస్థ పరిధిలో యోగాంధ్ర పోటీలు శనివారం గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో నిర్వహించారు. నగరంలోని మూడు నియోజకవర్గాల నుంచి ఔత్సాహిక పోటీదారులు ఇందులో పాల్గొన్నారు. పోటీలు వివిధ వయస్సు కేటగిరీల్లో జరగ్గా ఆయా విభాగాల్లో పాల్గొన్న విజేతలు తర్వాత జరిగే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు కె.ప్రభుదాస్, కె.షమ్మీ, రమ్య కీర్తన, పాల్గొన్నారు.